ప్రజాశక్తి
మంగళవారం 1 అక్టోబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పర్మినెంట్ చేయాల్సిందే..

విశాఖలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలుకు తక్కువ లేకుండా చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన చేపట్టిన డిమాండ్స్ డే విజయవంతమైంది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో చేపట్టిన ధర్నాలకు, ప్రదర్శనలకు వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు తరలివచ్చారు. సమస్యలు పరిష్కరించాలని నినదించారు. విశాఖ జిల్లాలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ధర్నాకు ముందు జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, సెంట్రల్ పార్కు మీదుగా తిరిగి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనకాపల్లి జిల్లాలో సిఐటియు కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. విశాఖలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, అనకాపల్లిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు.

వార్తలు 8లో..

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో కదంతొక్కిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు
- పలుచోట్ల ధర్నాలు, ప్రదర్శనలు
- డిమాండ్స్ డే విజయవంతం

అనకాపల్లిలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను మూతబెట్టేశారా?

- పబ్లిక్ సర్వీస్ కమిషన్, పోటీ పరీక్షల శిక్షణ వైపు కన్నెత్తి చూడని కూటమి సర్కారు
- 'రుషికొండ' శిక్షణా కేంద్రంపై నీలినీడలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ రుషికొండలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ అంటే పోటీ పరీక్షలకు వెళ్లే నిరుద్యోగ యువతకు 'కల్పతరువు'. అయితే ముచ్చటగా మూడేళ్లకే ఆ శిక్షణా సంస్థను పాలకులు మూలన పడేశారా? సమాజంలోని వెనుకబడిన తరగతుల యువత పోటీపరీక్షల్లో శిక్షణ పొందేందుకు వీలైన కేంద్రానికి వేసిన తాళాలు తెరచుకుంటాయా? లేదా ఇంకా ఎంత కాలం శిక్షణ కోసం వేచిచూడాలి? అన్నది ఇప్పుడు చదువుకున్న యువతను కలచివేస్తున్న సమస్య. ఈ స్టడీ సర్కిల్ పేద, వెనుకబడిన తరగతుల కోసం ప్రారంభించాలన్న డిమాండ్ 2014వ సంవత్సరం నుంచి ఉంది. నిరుద్యోగ యువత దీనికోసం అప్పట్లో పోరాడి సాధించుకున్నారు. రుషికొండలోని శ్రీవేంకటేశ్వరుని ఆలయం పక్కనే రూ.కోట్లతో నిర్మాణం జరిగి, గత ప్రభుత్వ హయాంలో యువత పోటీ పరీక్షలకు శిక్షణ అందించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌పై నీలినీడలు అలముకున్నాయి. రుషికొండ ప్రాంతంలో 2022-2023 సంవత్సరంలో సాంఘిక సంక్షేమ శాఖ (సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్) ఆధ్వర్యాన ప్రారంభమైన డాక్టర్ బిఆర్.అంబ్కేర్ స్టడీ సర్కిల్ కోచింగ్ ఎపిపిఎస్‌సి, పోటీ పరీక్షల శిక్షణా కేంద్రానికి తాజాగా తాళాలు వేసి దర్శనమిస్తున్నాయి. గడిచిన మూడేళ్లలో ఏటా సుమారు 300 మంది నిరుద్యోగ యువత (డిగ్రీ లేదా సమానమైన అర్హతల)పై ప్రవేశ పరీక్ష రాసి ఉత్తీర్ణులై ఇక్కడ శిక్షణ పొంది అదే సంఖ్యలో ఉద్యోగాలు కూడా పొందారన్నది ఆ సంస్థ వెల్లడించిన లెక్కలు వెల్లడి చేస్తున్నాయి.

ఇక్కడ శిక్షణతో పోటీపరీక్షల్లో విజయం తథ్యం

2022-23 మొదటి బ్యాచ్ మొదలుకొని 2024 జూన్ వరకూ మూడు బ్యాచ్‌లకు కోచింగ్ ఇచ్చారు. మూడవ బ్యాచ్ సెప్టెంబర్ 2023లో ప్రారంభించారు. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన అర్హతా పరీక్షలో సుమారు 100 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. ప్రభుత్వం అప్పట్లో వీరిని సెలక్టు చేసింది. సుమారు పది నెలల పాటు అంటే 2024 జూన్ వరకూ యూపిఎస్‌సి, ఎపిపిఎస్‌సి పోటీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చారు. జివిఎంసి కమిషనర్ కూడా దీన్ని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉంది. గత అకడమిక్ ఇయర్ అంటే 10 నెలల కాలంలో 48 మాక్ టెస్ట్‌లు ఇక్కడ నిర్వహించడంతో 2024 జూన్ 16న యూపిపిఎస్‌సి ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో అదే బ్యాచ్‌లో ఉన్నవారిలో 12 మంది ఉత్తీర్ణత సాధించగా, గ్రూప్-2కు మాత్రం 80 మంది

మిగతా 2లో..

కొత్త బ్యాచ్‌కు త్వరలో నోటిఫికేషన్?

అంబేద్కర్ స్టడీసర్కిల్ ద్వారా ఏటా వందల సంఖ్యలో ఉద్యోగాలు లభించాయి. గత బ్యాచ్ 9 నెలల శిక్షణ అయిపోయింది. త్వరలో ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ వస్తుందని ఎదురు చూస్తున్నాం. కొత్త బ్యాచ్‌ను నోటిఫికేషన్ ఇచ్చి ఎంపిక చేయాల్సి ఉంది. అత్యంత ఖరీదైన పోటీ పరీక్షల మెటీరియల్, శిక్షణతో పాటు హాస్టల్‌లో ఉండేందుకు నెలకు ఒక విద్యార్థికి రూ.2250 మెస్ ఛార్జికింద రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది.

- రామారావు, డిప్యూటీ డైరెక్టర్, విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ

వైభవ్ అక్రమ లే-అవుట్!

- అనుమతి పొందినకంటే ఎక్కువ విస్తీర్ణంలో పనులు
- చోద్యం చూస్తున్న విఎంఆర్‌డిఎ
- స్టీల్‌ప్లాంట్ భూమిలో గ్రావెల్ తరలింపు
- 38 సెంట్లు ప్రభుత్వ భూమికి అనుమతి
- డబ్బు చెల్లింపుపై రెవెన్యూ రహస్యం
- ఇష్టానుసారంగా చెట్లు కొట్టివేత

వైభవ్ లే-అవుట్

గ్రావెల్ అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) నుంచి పూర్తి అనుమతులు తీసుకోకుండానే వైభవ్ హేబిటేట్స్ 46.62 ఎకరాల్లో అక్రమంగా లే-అవుట్ పనులు చేపడుతోంది. 18.26 ఎకరాల్లో లే-అవుట్ వేసుకునేందుకు అనుమతులు తెచ్చుకొని, మిగిలిన భూమిలో చాలా వేగంగా లే-అవుట్ పనులు వైభవ్ చేయిస్తోంది. పలుకుబడి కల్గిన వైభవ్ జోలికి వెళ్లడానికి రెవెన్యూ, విఎంఆర్‌డిఎ అధికారులు భయపడుతున్నారు. చదును చేస్తున్న భూమిలో ఎన్ని ఎకరాలకు భూ వినియోగ మార్పిడి పన్ను ప్రభుత్వానికి చెల్లించారన్న వివరాలు చెప్పడానికి అటు రెవెన్యూ అధికారుల నుంచి ఇటు వైభవ్ లే-అవుట్ ప్రతినిధుల వరకు ఎవరూ స్పందించడంలేదు. జిల్లాలోని కె.కోటపాడు మండలం ఆర్లి పంచాయతీలోని సర్వే నెంబర్ 84/4, 84/5, 88లో 46.62 ఎకరాల్లో లే-అవుట్ పనులు జరుగుతున్నాయి. దీంట్లో విఎంఆర్‌డిఎ నుంచి 84/5, 88లో 18.26 ఎకరాలకు ఎల్‌పి నెంబరు 72/2003/1167 లభించింది.

లే-అవుట్ పనులు జరుగుతున్న 46.62

మిగతా 2లో..

అక్రమాలపై విచారణ చేపట్టాలి

ఆర్లి పంచాయతీ పరిధిలో వైభవ్ అక్రమ లే-అవుట్ వేస్తోంది. గెడ్డలు, పోరంబోకు, అటవీశాఖ భూములను వదిలిపెట్టలేదు. లే-అవుట్ రోడ్డు కోసం గ్రావెల్ కోసం అక్రమంగా కొండలను తవ్వుతున్నారు. భారీగా తారు రోడ్డు వేశారు. రెవెన్యూ అధికారులు వైభవ్ అక్రమాలను పట్టించుకోలేదు. జాయింట్ కలెక్టర్ స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలి. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. విచారణ పూర్తయ్యే వరకు పనులు నిలిపివేయాలి.

- డి.వెంకన్న, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

మొదటి పేజీ తరువాయి..

అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను మూతబెట్టేశారా?

ఉత్తీర్ణత సాధించడం విశేషం. అంటే శిక్షణ పొందిన 100మందికి 100 మంది సుమారుగా విజయం సాధించారన్నది స్పష్టమవుతోంది.

పోటీ పరీక్షలకు తగిన తర్ఫీదు...

ప్రస్తుత పోటీ పరీక్షల వాతావరణంలో దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల వారికి పోటీపరీక్షల సబ్జెక్టులకు సంబంధించిన మెటీరియల్, పుస్తకాలు, మాగ్జైన్‌లను, ఇంటర్నేషనల్ అఫైర్స్ బులెటెన్స్ రూ.వేలకు వేలు వెచ్చించి కొనుక్కోవడం కష్టసాధ్యమన్నది తెలిసిందే. వీటన్నిటినీ ఈ సెంటర్‌లో అధునాతన లైబ్రరీతో కూడిన డార్మిటరీల్లో విద్యార్థులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేలా హైదరాబాద్, విశాఖ నుంచి విశ్వవిద్యాలయాల నుంచి ప్రొఫెసర్లను, కాంపిటేటివ్ సబ్జెక్ట్ జనరల్ స్టడీస్ నైపుణ్యం గల అధ్యాపకులను ప్రభుత్వమే పంపిస్తూ ఈ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇచ్చేది. పోటీ పరీక్షలకు ఇలా విద్యార్థులకు 'చేయూతను అందజేస్తూ విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఉద్యోగాల కోసం శిక్షణ ఇస్తూ అనేక మందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ విజయం దిశగా పయనిస్తున్న వేళ ఈ ఏడాదికి సంబంధించి రాష్ట్రంలోని టిడిపి సర్కారు ఇటువైపు (నోటిఫికేషన్ ఇచ్చే దిశగా) కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ఈ ఏడాది అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను తెరుస్తారా? అంటే రాష్ట్ర పాలకుల నుంచి ఉలుకూ పలుకూ లేదు.

వైభవ్ అక్రమ లే-అవుట్

ఎకరాలు చదును చేయడానికి అడ్డగోలుగా ఆర్లి కొండ కింది భాగంలోని రోడ్‌కు ఆనుకొనివున్న స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూముల నుంచి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతి రోజూ వందల ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిస్తున్నా రెవెన్యూ ఉద్యోగులు పైనుంచి వస్తున్న ఒత్తిళ్లతో కళ్ళు మూసుకొని పక్క నుంచి తప్పించుకొని వెళ్లిపోతున్నారు. గ్రావెల్ అక్రమ తరలింపు గత ప్రభుత్వంలో మొదలై, ఈ ప్రభుత్వంలో కొనసాగుతోంది. కొంతమందిని వైభవ్ తమ చేతుల్లో పెట్టుకోవడంతో అక్రమ లే-అవుట్‌కు అడ్డు చెప్పేవారులేకుండా పోయారు. ఆర్లి నుంచి లే-అవుట్ వరకు ప్రభుత్వ రోడ్డులో వెడల్పయిన బిటి రోడ్ నిర్మించింది. తమ లే-అవుట్‌కు వెళ్లడానికి ఆకర్షణీయమైన దారిని నిర్మించుకుంది. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా లే-అవుట్‌లోకి ప్రవేశించడానికి ముందున్న సర్వే నెంబరు 299/5లో 14.50 సెంట్లు, 84/1లో 24.30 సెంట్లు వెరసి 38.80 సెంట్లు ప్రభుత్వ భూమికి అనుమతులు పొందింది. ఈ 38.80 సెంట్లుకు వైభవ్ చెల్లించిన ధర కూడా రెవెన్యూ అధికారులు అత్యంత రహస్యంగా ఉంచుతున్నారు. వైభవ్‌కు ప్రభుత్వ భూమి ఇచ్చినట్లు చెబుతున్నారు తప్పితే, ఏ ధరకు ఇచ్చారనే సమాచారం తమ వద్దలేదని రెవెన్యూ అధికారులు తప్పించుకుంటున్నారు.

వైభవ్ హేబిటేట్స్ ప్రయివేట్ లిమిటెడ్ వేస్తున్న లే-అవుట్ పనులకు చెట్లు కొట్టడానికి ఎటువంటి అనుమతులు తీసుకోలేదని ఇటీవల బదిలీ అయిన కోటపాడు తహశీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. లే-అవుట్‌లో చెట్లు ఉన్నప్పటికీ అనుమతులు తీసుకోకుండానే తొలగించి ఆ ప్రాంతమంతా గ్రావెల్‌తో నింపుతున్నారు. లే-అవుట్‌కు పైన రిజర్వు ఫారెస్టు ఉంది. కింది భాగంలో గెడ్డలున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బఫర్ జోన్ కింద స్థలం విడిచిపెట్టాలి. గెడ్డలు కన్పించకుండా లే-అవుట్ వేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులకు నియామక పత్రాలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జివిఎంసిలో వార్డు సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శులకు నియామక పత్రాలను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వులు మేరకు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విశాఖపట్నానికి 49 మందిని సూపర్ న్యూమరీ ఉద్యోగులుగా ఖరారు చేస్తూ జారీ చేసిన నియామక పత్రాలను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ స్వాతిదాస్, అదనపు కమిషనర్ డివి.రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-కిరండూల్ రైళ్లకు అదనపు విస్టాడోమ్ కోచ్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల అదనపు రద్దీని తొలగించడానికి విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైళ్లకు అదనపు విస్టాడోమ్ కోచ్, 3ఎ ఎసి ఎకానమీ కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. 08551 విశాఖపట్నం-కిరండూల్ రైలుకు అక్టోబర్ 3, 5, 7, 9, 11, 13, 15, 17,19, 21 తేదీల్లోనూ, 08552 కిరండూల్-విశాఖపట్నం రైలుకు అక్టోబర్ 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20 తేదీల్లో అదనపు విస్టాడోమ్ కోచ్‌లు జతచేయనున్నట్లు పేర్కొన్నారు. 08551 విశాఖపట్నం-కిరండూల్ రైలుకు అక్టోబర్ 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20 తేదీల్లోనూ, 08552 కిరండూల్-విశాఖపట్నం రైలుకు అక్టోబర్ 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21 తేదీల్లోను అదనంగా 3ఎ ఏసీ ఎకానమీ కోచ్ జతచేయనున్నట్లు తెలిపారు

సెబి ఇన్‌స్పెక్టర్లకు ఎక్సైజ్ శాఖలో పోస్టింగులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను (సెబి) రద్దు చేయడంతో అందులో విధులు నిర్వహించి ప్రస్తుతం పోస్టింగుల కోసం ఎదురుచూస్తున్న పలువురు ఇన్‌స్పెక్టర్లకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగంలో పోస్టింగులు కల్పిస్తూ, బదిలీలు చేస్తూ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలలో విశాఖపట్నం జిల్లాకు చెందిన మహారాణిపేట స్టేషన్‌కు బి.జగదీశ్వరరావు, సీతమ్మధార స్టేషన్‌కు బి.నాగవేణి, గోపాలపట్నం స్టేషన్‌కు బి.చంద్రశేఖర్‌రాజు, గాజువాక స్టేషన్‌కు ఎంఆర్‌వి.అప్పారావు, పెందుర్తి స్టేషన్‌కు ఎ.సరోజాదేవి, భీమిలి స్టేషన్‌కు పి.శ్రీనివాసరావులను, అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లికి వై.లక్ష్మణ్‌నాయుడు, చోడవరానికి కెవి.పాపునాయుడు, మాడుగులకు సిహెచ్‌వి.ప్రసాద్, నర్సీపట్నానికి కె.సునీల్‌కుమార్, ఎలమంచిలికి పి.తేజోవెంకటకుమార్, పాయకరావుపేటకు జి.శ్రీనివాస్, సబ్బవరానికి డి.అనిల్‌కుమార్, గొలుగొండకు పి.మురళీధర్‌ను బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు.

Estd. 2008
NSRIT
NADIMPALLI SATYANARAYANA RAJU INSTITUTE OF TECHNOLOGY
AUTONOMOUS
NAAC 'A' GRADE
(Approved by AICTE, New Delhi II Affiliated to JNTUK, Kakinada II An ISO 9001,ISO 14001 & ISO 45001 Certified Institution)
Recognised under Section 2 (f) & 12B of the UGC Act,1956 II Accredited by NAAC with 'A' Grade (3.10/4.00)
SONTYAM, PENDURTHI - ANANDAPURAM Highway, Visakhapatnam-531173 web : www.nsrit.edu.in
APICET-2024-25 | SPOT & CAT-B ADMISSIONS
Candidates who are interested in PG Courses MBA/MCA under Spot & Cat-B Admissions for the following programs of MBA & MCA may visit the college with all original certificates on or before Oct. 07, 2024.Your admission will be made as per the guidelines issued by AP-ICET-2024. The candidates who are admitted under Spot & Cat-B Admission are not eligible for Government fee reimbursement.
For Further details Contact: 8099464546, 9885824167
Date: 01-10-2024 Sd/- PRINCIPAL

మెప్మా ఆర్‌పిలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి మెప్మా ఆర్‌పిలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మెప్మా ఆర్‌పి ఉద్యోగ సంఘం (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.మణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, మెప్మా ఆర్‌పిలకు మూడేళ్ల కాల పరిమితి ఉత్తర్వులు రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలను వ్యక్తిగత అకౌంట్లో వేయాలని, యూనిఫామ్,ఐడి కార్డ్ ఇవ్వాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు పి.మల్లేశ్వరి, కార్యదర్శి సిహెచ్.రఘునీ తదితరులు పాల్గొన్నారు.

విలీన కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి వద్ద ఉన్న విలీన కార్మికుల ఆదాయపు పన్ను, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు తక్షణం చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వందలాదిమంది కార్మికులతో జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా జివిఎంసి ప్రధాన కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. 5500 మంది మున్సిపల్ వర్కర్లకు చెందిన రెండేళ్ల ఆదాయపన్ను రూ.4 కోట్లు 50 లక్షలు సిఐటియు కృషితో రిఫండ్ చేసిన నగదును వెంటనే పారిశుధ్య కార్మికుల బ్యాంకు అకౌంట్లో వేయాలని కోరారు. ఎస్‌ఎల్‌ఎఫ్ అకౌంట్లో అవినీతి ప్రచారంపై విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, అధ్యక్షుడు టి.నూకరాజు, గణేష్, ఆర్.నాయుడు, ప్రసాద్, శేషు, రాజశేఖర్, ఈశ్వరరావు, వెంకటరావు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలి

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలపడాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆకాంక్షించారు. సైనిక సంక్షేమ నిధి కోసం జిల్లా మహిళా సమాఖ్య తరపున పాత, కొత్త సంఘాలు కలిసి వేసుకున్న చందా రూ.4 లక్షలా 45 వేలా 127 చెక్కును జిల్లా కలెక్టర్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ భద్రత కోసం నిరంతరం శ్రమించే సైనికులకు, వారి కుటుంబాల సంక్షేమ నిధికి మహిళా సంఘాల సభ్యులు విరాళం అందించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, ఆర్‌డిఓ డి.హుస్సేన్ సాహెబ్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎన్.శోభారాణి పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఏపి ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌ను సోమవారం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మర్యాదపూర్వంగా కలిసి సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. అనంతరం గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని కోరారు.

'జార్జియన్ జాతీయ విశ్వ విద్యాలయంలో నాణ్యమైన వైద్య విద్య'

మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ బుచాన్ వల్లి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జార్జియా దేశంలోని ఎస్ఇయు జార్జియన్ జాతీయ విశ్వ విద్యాలయంలో తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన వైద్య విద్య అందుబాటులో ఉందని ఆ విశ్వ విద్యాలయ రెక్టార్ డాక్టర్ బుచాన్ వల్లి తెలిపారు. పెదవాల్తేరులోని విశాఖ ఐ హస్పిటల్ వెనుక జివి స్క్వేర్‌లోని ఇన్విక్టా కెరీర్ కన్సల్టెన్సీ కార్యాలయం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారత్‌లో వైద్య విద్య మధ్య తరగతి ప్రజలకు అత్యంత ఆర్థిక భారంతో కూడుకున్నదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ ప్రఖ్యాత ఎస్ఇయు జార్జియన్ విశ్వ విద్యాలయంలో అన్ని వసతులతో వైద్య విద్యను తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకు వచ్చామని చెప్పారు. పలు కంప్యూటర్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యలు మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ఫీజుల్లో అందిస్తున్నామన్నారు. తాము అందిస్తున్న డిగ్రీలను అమెరికా, యూరప్‌ల్లో ఆయా ఉన్నత విద్యా మండలి ఆమోదిస్తున్నాయని తెలిపారు. ఇంటర్ 60 శాతం మార్కులు సాధించి నీట్ పరీక్షలో అర్హత సాధించిన వారు తమ వద్ద వైద్య విద్యలో చేరడానికి అర్హులని పేర్కొన్నారు. ఇంటర్ 80 శాతం మార్కులు దాటిన వారికి స్కాలర్ షిప్ సదుపాయం ఉందన్నారు. తమ వద్ద విద్యార్థులు 56 నెలలు వైద్య విద్యాభ్యాసం, ఆ తరువాత ఇంకో 12 నెలలు సంబంధిత ఆసుపత్రిలో ఇంటర్న్ షిప్ చేయవలసి ఉంటుందన్నారు. మీడియా సమావేశంలో సంస్థ ఎండీ డాక్టర్ చిరాగ్, సంస్థ ప్రతినిధి వివేకానంద మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసిలో 102 వినతులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జివిఎంసిలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 102 వినతులు వచ్చాయని మేయర్ హరి వెంకటకుమారి తెలిపారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ, అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

పీలాకు గంటా అభినందనలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యన్నారాయణను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. ఎంవిపి.కాలనీలోని గంటా నివాసంలో గోవింద్ మర్యాదపూర్వకంగా కలిశారు. సకాలంలో నిధులు అందేలా చూసి పట్టణాభివృద్ధికి తోడ్పాటు అందించాలని గోవింద్‌కు గంటా సూచించారు. పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకుని మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేయాలని సూచించారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE cum M.A.C.T, AT: VISAKHAPATNAM
M.O.P. 278/2023
Between:
Sri Maddala Sai Narasing Kishan, being minor rep. by his father & natural guardian Maddala Shiva Kishore ...Petitioner
And:
Uriti Girish Babu & 2 others ...Respondents
NOTICE
To,
R-2: Gunta Dharma Rao,
S/o. not known,R/at D.No.20-105/6, Doggavanipalem, Pendurthi, Visakhapatnam.
(Owner of Car carriage bearing Reg. No. AP 39 CX 9271)
Please take notice that the abovenamed petitioner herein has filed the above M.O.P. against you and other respondents for claiming compensation and the matter stands posted to **17-10-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **17-10-2024** at **10:30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
M.A. PRASAD (Baji), A. RAMAKRISHNA,
Advocates
Visakhapatnam,
Cell:9246673639

నూతన అధికారులకు అభినందన

సిఐని కలిసి అభినందిస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం: ఇటీవల బదిలీల్లో మండలంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులను మండల జనసేన నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనందపురం సిఐ చింతావాసునాయుడు, తహశీల్దార్ పేర్లి శ్యాంప్రసాద్, ఎంపిడిఒ డాక్టర్ జానకిలను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రూరల్ కార్యదర్శి మజ్జి శ్రీను, మండల ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి మూర్తి, ఉపాధ్యక్షులు శివకృష్ణ, బూత్ కన్వీనర్లు గోవింద్, ప్రసాద్, లెంక శంకర్, ఆల్తి రాజు, సురేష్ పాల్గొన్నారు.

అధికారులను కలిసిన పౌరసంక్షేమ సంఘం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి రెండవ జోన్ పరిధిలో జెడ్‌సిగా బాధ్యతలు స్వీకరించిన సింహాచలం, ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ శైలజను సోమవారం పౌర సంక్షేమ సంఘ అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో సంగ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు.

కేంద్ర పథకాల అమలుపై పరిశీలన

మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని అయినాడ, కోరాడ గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో కేంద్రబృందం సోమవారం పర్యటించింది. కేంద్ర పథకాల అమలు తీరుపై పరిశీలించింది.

అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోల్కర్‌లతో కూడిన బృందం ఆయా పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, గ్రామ పంచాయతీ, రైతు భరోసా కేంద్రాలు, హార్టీకల్చర్, హౌసింగ్, స్వయం సహాయక సంఘాల నిర్వహణ, భూరికార్డుల పరిశీలన వంటి పలు అంశాలను పరిశీలించారు. మహిళా సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డిపిఎం సంజయ్, వైదేహి, ఎపిఎం ఆదినారాయణ, ఎంపిడిఒ ఎం.విజయకుమార్, ఇఒపిఆర్‌డి కెవిఎన్‌కుమార్ మండల స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్లు రద్దు చేయాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్లను రద్దు చేసి, పోర్టు సొంత నిధులతోనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్, పోర్టు చైర్మన్‌కు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు వినతిపత్రాలు పంపించారు. సాలిగ్రాం పురంలోని పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని 300 పడకల "మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్"గా పిపిపి పద్ధతిలో నిర్మాణానికి టెండర్లు అహ్వానించారని, దీనివల్ల సుమారు40 వేల మంది పోర్టు, డాక్ కార్మికులు ఉద్యోగులు, పూర్వ ఉద్యోగుల కుటుంబాల ఆరోగ్య భద్రత ప్రైవేటు చేతుల్లోకి పోతుందని తెలిపారు. విశాఖ పోర్టులో ఇప్పటికే ఓర్ హాండ్లింగ్ ప్లాంట్, కంటైనర్ టెర్మినల్, వివిధ విభాగాలు, 8 బెర్తులు ప్రైవేటు పరమయ్యాయన్నారు. నేషనల్ అస్సెట్స్ మోనోటైజేషన్ పైప్ లైన్ పథకం కింద మరో 5 బెర్తులు పిపిపి పద్ధతిలో కారుచౌకగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటుకు కట్టబెట్టిందని వివరించారు. ఒకసారి ప్రైవేటుపరమైతే తిరిగి పోర్టు ఆధీనంలోకి వచ్చే అవకాశం లేదని అనుభవం తెలుపుతుందని పేర్కొన్నారు. ఇప్పుడు హాస్పిటల్ కూడా ప్రైవేటుపరమైతే అదే పరిస్థితి ఉంటుందని తెలిపారు. పోర్టును ఉన్నతస్థితికి, అంతర్జాతీయ స్థాయికి తెచ్చిన ఉద్యోగ, కార్మిక, రిటైర్ కార్మికుల కుటుంబాలకు వైద్య ఖర్చులు తగ్గించాలన్న నెపంతో ఏర్పాటుచేసిన హాస్పిటల్‌ను ప్రైవేట్ వారికి కట్టబెట్టాలన్న నిర్ణయం వెంటనే విరమించాలని విజ్ఞప్తి చేశారు. పోర్టు నిరంతరం లాభాలతో నడుస్తోందని, రూ.కోట్ల విలువైన సొంత భూములున్నాయని తెలిపారు. తమరు వెంటనే కలుగజేసుకొని విశాఖ పోర్టు నిధులతోనే పోర్టు ఆసుపత్రిని మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

వర్గీకరణపై ముందుకు వెళితే ప్రతిఘటన

ప్రజాశక్తి- ఉక్కునగరం: ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణపై ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చర్యలు చేపడితే ప్రతిఘటన తప్పదని పలువురు స్పష్టం చేశారు. సోమవారం. స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌సి అసోసియేషన్ కార్యాలయంలో వర్గీకరణ క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో బేతాళ సుదర్శన భారతీయ బౌద్ధ మహాసభ సమతా సైనిక రాష్ట్ర అధ్యక్షులు మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజ్యాంగంలో ఆర్టికల్ 341, 342, 15(4), 16 (4)లో లేని అంశాలను ఆపాదించి ఎస్‌సి,ఎస్‌టి వర్గీకరణ చేయాలనే తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు తీర్పును పున్నపరిశీలించాలని దేశవ్యాప్తంగా 32 రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారన్నారు. దీనిపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చేంతవరకు తెలుగు రాష్ట్రాల్లో దీనిపై ముందుకు పోరాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాలమహానాడు వ్యవస్థాపకుడు, అంబేద్కర్ గ్లోబల్ మిషన్ అధ్యక్షులు బయ్యా మల్లయ్య అధ్యక్షత వహించిన సమావేశంలో మాల మహానాడు, దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటా రావు, స్టీల్‌ప్లాంట్ మాజీ అధికారుల సంఘం అధ్యక్షులు మాటూరు శ్రీనివాసరావు , ఎం.ఎ.అప్పలరాజు, రేబాక మధు, ఎం వి రాహుల్ ,దాకే సువర్ణ రత్నం పుల్లారావు మోహన్ బాబు పాల్గొన్నారు. పి రాజ్‌కుమార్, కె రామకృష్ణ సుధీర్‌రాజు, బిరుదు గడ్డ అరవింద్ కుమార్, జి ఫణీంద్రబాబు కెవి సురేష్ , యాదల అనిల్ కుమార్ ఏడుగురు సభ్యులతో స్టీల్ ప్లాంట్ మాలల కమిటీని ప్రకటించారు

సభ్యత్వ నమోదుపై సమావేశం

ప్రజాశక్తి- భీమునిపట్నం : సభ్యత్వ నమోదులో భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని టిడిపి యువ నేత గంటా రవితేజ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆన్‌లైన్ సభ్యత్వ నమోదుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల సాధారణ ఎన్నికల్లో భారీ ఓట్ల ఆధిక్యతను సాధించగలిగామో, అదే స్థాయిలో సభ్యత్వ నమోదు ఉండాలని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.టిడిపి నాయకులు డిఎవెన్ రాజు, గాడు వెంకటప్పడు, గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, కె దామోదర రావు, దాసరి శ్రీనివాస్, గాడు చిన్ని కుమారి లక్ష్మి పాల్గొన్నారు

పద్మశాలీలకు ప్రాధాన్యతనివ్వాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయమని, ఈ కార్పొరేషన్‌లో డైరెక్టర్లుగా అదే కులానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు జి గంగరాజు, ప్రధాన కార్యదర్శి టి అప్పారావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే గంటా స్పందిస్తూ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

బీచ్ పరిశుభ్రత

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక ఐఎన్‌ఎస్ కళింగకు ఎదురుగా బీచ్‌ను స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం శుభ్రపరిచారు. జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి, సిబ్బంది పాల్గొని, బీచ్ ఒడ్డున ఉన్న చెత్తా చెదారాలను, వ్యర్థాలను సేకరించి, గోనె సంచుల్లో వేసి వ్యాన్‌లో తరలించారు

సమస్యలపై వినతులు అందజేత

అర్జీలు స్వీకరిస్తున్న జెడ్‌సి రాము

ప్రజాశక్తి - విశాఖపట్నం: జివిఎంసి ఐదోజోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి రెండు అర్జీలు వచ్చాయని జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు. వీటి పరిష్కారానికి సంబంధిత విభాగానికి రిఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో ఇఇలు మత్స్యరాజు, ప్రసన్న, శేఖర్, ఎసిపి వెంకటరావు, ఎఎంహెచ్ఒ డాక్టర్ సునీల్‌కుమార్, ఆర్ఒ బాబూరావు, రాజ్యలక్ష్మి, ఎపిడిలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడ జాతీయ రహదారి నుండి నగరంపాలెం వెళ్లే రహదారి నిర్మాణం పూర్తి చెయ్యాలని, చంద్రంపాలెం హైస్కూల్ వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నడక వంతెన త్వరగా నిర్మించాలని సిపిఐ నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం జెడ్‌సిని కలిసి వినతిపత్రం అందజేశారు.

మధురవాడ జంక్షన్ నుంచి నగరంపాలెం వెళ్లే రహదారి నిర్మాణానికి 2014 అసెంబ్లీ ఎన్నికల ప్రకటన కొద్దిరోజులు ముందు హడావుడిగా శంకుస్థాపన చేశారని, ఎన్నికలు తరువాత 80 అడుగుల రహదారిలో ఒకపక్క 40 అడుగులు రహదారి పూర్తిచేశారన్నారు. గత ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో దీనివైపు కన్నెత్తి చూడలేదన్నారు. అసంపూర్తి రహదారితో పదేళ్లుగా స్థానికులు పడుతున్న ఇబ్బందులు, ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని, రోడ్డు సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పూర్తిచేయాలని కోరారు.

అలాగే నాలుగువేలు పైచిలుకు విద్యార్థులున్న చంద్రంపాలెం ఉన్నతపాఠశాల వద్ద జాతీయరహదారిలో పైవంతెన హామీలు, కాగితాలు, శంకుస్థాపనలకే పరిమితమైందన్నారు. ఇక్కడ రోడ్డు దాటుతూ ముగ్గురు విద్యార్థులు మృత్యువాతపడగా, పలువురు గాయపడిన సందర్భాలున్నాయని, ఈ నేపథ్యంలో రోడ్డుకు అడ్డంగా పైవంతెన ఏర్పాటు చేయాలని సిపిఐ పదేపదే అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఇటీవల ఎన్నికలకు ముందు శంకుస్థాపనలతో వైసిపి నేతలు హడావిడి చేసినా పనులు జరగలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా కష్టాలు తీర్చాలని కోరారు. సిపిఐ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతు బజారును వినియోగంలోకి తేవాలి

భీమునిపట్నం : జివిఎంసి జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జెడ్‌సి పిల్లి ప్రేమ ప్రసన్న వాణి పాల్గొని11 అర్జీలు స్వీకరించారు.తగరపువలస రైతుబజారును వినియోగంలోకి తేవాలని, జెడ్‌పి హైస్కూల కు వెళ్లేమార్గంలో చావుల మదుము రోడ్డును వెడల్పు చేయాలని, కొత్తపేట శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ భీమిలి ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, ఎం అప్పలరాజు వినతిపత్రం అందజేశారు.

భీమిలి జమ్మి చెరువు పార్కులో వ్యాయామ పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని వాకర్స్ సభ్యులు ఎస్ జోగారావు వినతిపత్రం అందజేశారు.పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాలకు సంబంధించి చెరొకటి, ఇంజనీరింగ్ విభాగానికి 9 మొత్తంగా 11 అర్జీలు అందాయి. వీటిని తదుపరి చర్యలకు ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు జెడ్‌సి తెలిపారు

నేరాలు ఘోరాలు

47 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల మండలం తాటిపర్తి గ్రామ శివారులో 47 కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. సోమవారం ముందస్తు సమాచారంతో తాటిపర్తి గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. పాడేరు నుండి మైదాన ప్రాంతం వైపు వస్తున్న కారును తనిఖీ చేయగా 47 కేజీల గంజాయిన పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. కారులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో మాడుగుల పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నిందితునికి మూడురోజుల జైలు

-మరో 12మందికి వెయ్యి చొప్పున జరిమానా

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన నిందితుల్లో ఒకరికి జైలుశిక్ష, మరో 12మందికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని ట్రాఫిక్ ఎస్ఐ జి.ప్రసాద్ తెలిపారు. పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 13మందిని కోర్టులో హాజరుపరచగా, రెండవ స్పెషల్ జ్యుడీషియల్ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ విచారించి, బి.వెంకటరమణ అనే నిందితునికి మూడురోజుల సాదారణ జైలు, రూ.50జరిమానా విధించగా, మరో 12మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారని ఎస్ఐ తెలిపారు.

పాత్రికేయునిపై దాడి

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని పెంట గ్రామానికి చెందిన పాత్రికేయుడు నారాయణమూర్తిపై ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసారు. పక్కా స్కెచ్‌తో దాడికి పాల్పడిన ఘటనలో నారాయణమూర్తి తలపై గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పద్మనాభం సిఐ సిహెచ్.శ్రీధర్, క్షతగాత్రుడిని తగరపువలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. పెంట పంచాయతీలో భూవివాదంలో రెండువర్గాల మధ్య గొడవ నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లుభావిస్తున్నారు.

బైక్‌ను దగ్ధం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

ప్రజాశక్తి- మాధవధార :కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి బర్మా క్యాంప్ శ్రీనివాస్‌నగర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావుకు చెందిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. బైక్ దగ్ధమవుతుండడంతో మేల్కొన్న స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి కె.వి.టి ప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. కంచరపాలెం ఎస్ ఐ సమీర్ పరిస్థితి సమీక్షించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించగా,కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడలో అదనపు సౌకర్యాలతో 'సక్షం' అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం స్థానిక నేతలతో కలిసి ఐసిడిఎస్ రీజినల్ డైరెక్టర్ చిన్మయీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్తగా ప్రారంభమైన కేంద్రంలో బాల్యారంభ ధన సంరక్షణ, విద్య, పోషణ వాటిక, మంచి నీటి శుద్ధీకరణ మిషన్, పిల్లల శారీరక మానసిక, భావనాత్మక అభివృద్ధికి అవసరమైన అదనపు సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. దీని సేవలను అంగన్వాడీ లబ్ధిదారులైన పిల్లలు, బాలింతలు, గర్భిణులు, కిశోరబాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గాడు వెంకట ప్పడు, సర్పంచ్ వి రమావతి, ఎంపిటిసి చుక్క ఈశ్వరమ్మ, మాజీ జెడ్‌పిటిసి ఎస్ అప్పారావు,ఐసిడిఎస్ పీడీ జి.జయదేవి, సిడిపిఒ ఎం శ్రీదేవి, పలువురు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఆరుగురు

ఎంపికైన వెంకట్ విద్యాపీఠ్ విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో భాగంగా పాడేరు తలారసింగి పాఠశాలలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో శొంఠ్యాం వెంకట విద్యాపీఠ విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ రొంగలి వెంకటేశ్వరరావు తెలిపారు. అండర్-14 కేటగిరీలో వై.లాలిత్య, ఎన్.శ్యామ్‌బిందు, బి.మైత్రి శ్రీదేవి, ఎల్.చరణ్, అండర్-17 కేటగిరీలో జి. చాందిని, ఎం.యశ్వంత్ ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ చూపిన రెజ్లర్లను ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

మల్లఖంబ్ పోటీల్లో హరిణిశ్రీ ప్రతిభ

హరిణిశ్రీ

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని గుడిలోవ సరస్వతీ విద్యావిహార్‌కు చెందిన ఆరవ తరగతి విద్యార్థిని బి.హరిణిశ్రీ జాతీయస్థాయి మల్లఖంబ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం తెలిపారు. ఇటీవల కర్ణాటక బెలగావిలో నిర్వహించిన జోనల్‌స్థాయి పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో నాలుగో స్థానంలో నిలిచిన హరిణిశ్రీ, వచ్చేనెల 7 నుండి 10 వరకు రాజస్థాన్ కోటాలో జరగనున్న జాతీయపోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.మల్లఖంబ్ పోటీల్లో ప్రతిభ చూపిన హరిణిశ్రీని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, తోటి విద్యార్థులు అభినందించారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

షీల్డ్‌లతో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస: ఎస్ఙిఎఫ్ ఆధ్వర్యంలో చిట్టివలస జెడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో ఇటీవల జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా షాట్‌పుట్‌లో మొదటి స్థానం, ఖోఖోలో రెండో స్థానంలో నిలిచి బహుమతులు గెలుచుకున్న భీమిలి మండలం, తాటితూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులు చదువులోనే కాదు క్రీడల్లోనూ ముందు వరుసలో ఉంటారని హెచ్ఎం మురళి, ఉపాధ్యాయులు, పిఇటి కొనియాడారు.

మళ్లకు ఘన స్వాగతం

విజయకుమార్‌ను స్వాగతిస్తున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-కరాస : విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌కు సోమవారం విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.వైసిపి అధినేత జగన్మోహనరెడ్డి ఆదేశాలతో పశ్చిమ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించి, నగరానికి వచ్చిన ఆయనకు వైసిపి శ్రేణులు స్వాగతించి,సత్కరించారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం జరిగితే ఊరుకోం

నిరసనలో పాల్గొన్న అఖిలపక్ష కార్మికసంఘాల నేతలు

ప్రజాశక్తి - ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు అన్నారు. సోమవారం స్టీల్‌ప్లాంట్ బిసి గేటు వద్ద కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. కార్మిక సంఘం నేతలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తానని ఒకవైపు చెబుతూనే మరోవైపు పాస్‌ల రంగులను మారుస్తూ కాంట్రాక్ట్ కార్మికులపై ఉక్కుపాదం మోపే యోచనలో ఉక్కు యాజమాన్యం ఉందన్నారు.

నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి ఉక్కు యాజమాన్యం రంగం సిద్ధం చేసిందని, దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని కార్మిక సంఘ నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, స్టీల్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు టిఎన్‌టియుసి నాయకులు బొడ్డ పైడిరాజు, రాజేష్, వంశీ, పులి రమణారెడ్డి పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మరణం తీరనిలోటు

సంతాప సభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక: కార్మికులు, ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించిన సిపిఎం సీనియర్ నేత పి.నాగేశ్వరరావు మరణం తీరనిలోటని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గు.నాయుడు అన్నారు. సోమవారం దిబ్బపాలెం ఆర్‌హెచ్ కాలనీలో నాగేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో నాగేశ్వరరావు భాగస్వాములయ్యారన్నారు. ఈ ప్రాంత సమస్యలతోపాటు భవన నిర్మాణ కార్మిక సమస్యలపై నిరంతరం పోరాటం చేశారన్నారు. ఉద్యోగం చేస్తున్నప్పుడు, ఉద్యోగ విరమణ తర్వాత కూడా ప్రజలు, కార్మిక సమస్యల పరిష్కారానికి నిరంతరం తపిస్తూ, నమ్ముకున్న సిద్ధాంతాన్ని చివరివరకు కొనసాగించా రన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు కె.కిరీటం మాట్లాడుతూ, పివి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కొండలపై గుడిసెలు తీసేయాలని పిలుపునిచ్చినప్పుడు ఒక్క గుడిసె కూడా తొలగించకుండా, ఏ ఒక్క పేదవానికి నష్టం జరగకుండా చేపట్టిన పోరాటంలో నాగేశ్వరరావు పాత్ర మరవలేనిదన్నారు. సిపిఎం నాయకులు ఎ.లోకేశ్వరరావు మాట్లాడుతూ, సర్వేనెంబర్ 274లో పేదలకు ఇళ్ల స్థలాల పోరాటంలో పాల్గొన్నారన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షుతన జరిగిన సంతాప సభలో సిపిఎం నాయకులు, ఎన్. రాజేంద్రప్రసాద్, పివైవి రమణారావు, బంగారునాయుడు, కామేశ్వరి, ఎం.శ్రీదేవి, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు శారద, కుమారుడు జగన్, కుమార్తెలు పాల్గొన్నారు.

తొలగించిన తాత్కాలిక ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తొలగించిన తాత్కాలిక ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, అప్పటి సర్వీసును కలపాలని ఆల్ ఇండియా నేషనల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.ముత్యాలు డిమాండ్ చేశారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ, నెల్లూరు ఎల్ఐసి ఆఫ్ ఇండియా డివిజన్ 1993 నుంచి 1997 వరకు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా నియమించబడి, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించిన తాత్కాలిక ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకుని, పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. 27 ఏళ్లుగా జరుగుతున్న పోరాటానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి తాత్కాలిక ఉద్యోగుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ ఇవ్వాలని, ప్రస్తుతం 60 ఏళ్ల దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఫెడరేషన్ నాయకుడు దాడి నారాయణరావు మాట్లాడుతూ, తొలగించిన ఉద్యోగులను తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా వారిని తీసుకోకపోవడం అన్యాయమన్నారు. దీనిపై కంటెంట్ ఆఫ్ కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డ అప్పారావు, డి.సాల్మన్ రాజు, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూతన మద్యం పాలసీని రద్దుచేయాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 1 నుంచి ప్రవేశపెడుతున్న నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మెడకు ఉరి వేసుకొని వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యాన్ని ప్రభుత్వాలు ఆర్థిక వనరులుగా చూస్తున్నాయని, మద్యం పాలసీని సమూలంగా నివారించాలని డిమాండ్ చేశారు. పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ, మద్యం వల్ల కుటుంబాలు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అత్తిలి విమల మాట్లాడుతూ, వైన్ షాపులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించవద్దని డిమాండ్‌చేశారు. డి-అడిక్షన్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. అక్టోబర్ 15వ తేదీ లోపు ప్రభుత్వం తన నిర్ణయాలను పున సమీక్షించు కోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారంతా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకట లక్ష్మి, చైతన్య మహిళా సంఘం అధ్యక్షులు డి.లలిత, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు బేగం పాల్గొన్నారు.

శారదా పీఠానికి కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ శారదా పీఠానికి భీమిలి సమీపంలో కేటాయించిన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని, తిరుమల పుణ్యక్షేత్రంలో కేటాయించిన భూమిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్‌లో అప్పటి కెసిఆర్ ప్రభుత్వం శారదాపీఠానికి తక్కువ ధరకే కేటాయించిన భూమిని కూడా వెనక్కి తీసుకోవాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నామన్నారు. టిటిడి దర్శనం రేట్లు, రూమ్ రేట్లు పెంచి భక్తులపై భారం వేసిన టిటిడి మాజీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ కొప్పుర్ నికుంజ్, డాక్టర్ కె.సురేష్, బొల్లినేని వెంకటేశ్వరరావు, చిన్ని వరలక్ష్మి, పి.రాము, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఒమెగాలో అరుదైన శస్త్రచికిత్స

వివరాలు వెల్లడిస్తున్న ఒమెగా ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : 60 ఏళ్లమహిళకు ఆరిలోవ, హెల్త్ సిటీలోని ఒమెగా ఆసుపత్రి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి ప్రాణాలను కాపాడారు. దీనికి సంబంధించి సోమవారం ఆసుపత్రి సమావేశం మందిరంలో విలేకర్లతో మాట్లాడుతూ, అచ్యుతాపురానికి చెందిన 60 ఏళ్ళ మహిళ ఏడాదిగా తీవ్రకడుపు నొప్పి, ఉబ్బరంతో బాధపడుతుంది. ఒమెగా ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా ఆమెకు స్కానింగ్ రక్త పరీక్షలు నిర్వహించారు. కడుపులో గడ్డ ఉన్నట్లు గుర్తించి, అండాశయం కేన్సర్‌గా నిర్ధారించారు. ట్యూమర్ మొత్తం సుమారు 8 కిలోల బరువు కలిగి ఉండగా, అది మొత్తం కడుపును ఆక్రమించి పేగు భాగాలను, ఎడమ మూత్రనాళంపై ఒత్తిడి తెచ్చి, తీవ్ర కడుపు నొప్పికి కారణమైనట్లు నిర్ధారించారు. ఈ నెల 23న ఎన్‌టిఆర్ సేవా పథకం కింద శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ శృతి, ఎనస్థీషియన్స్ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ అనూషలతో కూడిన వైద్యనిపుణుల బృందం విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించి, కణితను తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం మహిళ కోలుకొని పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.

అమర్‌నాథ్‌కు వైసిపి నేతల అభినందన

అమర్‌నాథ్‌ను కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్‌ను సోమవారం జివిఎంసి 87వ వార్డు వైసిపి నేతలు మిండిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. అమర్‌ను కలిసిన వారిలో వైసిపి జిల్లా కార్యదర్శి ప్రగాఢ వేణుబాబు, ముద్దపు దామోదర్, ప్రగడ శ్రీనివాస్, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, 86వ వార్డు బిసి సెల్ అధ్యక్షులు ముద్దపు మురళీమోహన్, ప్రగడ శంకరరావు, బుల్లెట్ రమణ, మార్పు గోవింద, సబ్బవరపు ఈశ్వరరావు, దాకా సత్తిబాబు, పి రమణయ్య , డి అప్పుడు, ప్రగాఢ రాము పాల్గొన్నారు.

గంగవరం పోర్టుకు సిఐఐ మొదటి బహుమతి

బహుమతి స్వీకరిస్తున్న అదానీ గంగవరం పోర్టు ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) నిర్వహించిన 19వ ఎడిషన్ నిరంతర అభివృద్ధి కైజెన్ పోటీలో అదానీ గంగవరం పోర్టు మొదటి బహుమతి సాధించిందని పోర్ట్ ప్రతినిధి తెలిపారు. కైజెన్ మార్పులకు అనుగుణంగా అదానీ గంగవరం పోర్టు గణనీయమైన మెరుగుదలను దృష్టిలో పెట్టుకుని సిఐఐ సదరన్ రీజియన్ నిర్వహించిన 19వ ఎడిషన్ కంటిన్యూయస్ ఇంప్రూవ్‌మెంట్ (కైజెన్) పోటీలో మొదటి బహుమతిని గెలుచుకోవడం అదానీ (గ్రూపు) గొప్ప విజయంగా భావిస్తున్నామన్నారు. ఇది ఆపరేషనల్ ఎక్సలెన్స్ పట్ల తమ నిబద్ధతను, అర్థవంతమైన మెరుగుదలను నడిపించే సామర్థ్యాన్ని హైలైట్ చేస్తుందన్నారు పోర్టు ఉద్యోగుల కృషి, విధినిర్వహణ పట్ల వారి అంకితభావాన్ని ఇది స్పష్టం చేస్తోందని,భవిష్యత్ ప్రాజెక్టులకు మార్గదర్శనంగా ఉంటుందన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై

2న యుటిఎఫ్ సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి -అనకాపల్లి

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీన అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడి రమాజ్యోతికి యుటిఎఫ్ నాయకులు సోమవారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం మున్సిపల్ హైస్కూల్లో తగినంత మంది సబ్జెక్ట్ టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జిటి, పండిట్, పీఈటి పోస్టులను అప్గ్రేడ్ చేయాలని కోరారు. మున్సిపాలిటీలలో ఖాళీగా ఉన్న హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయులలో అర్హులైన వారిని అర్బన్ ఎంఈఓలుగా నియమించాలన్నారు. మున్సిపల్ టీచర్లకు జిపిఎఫ్ ఖాతాలు తెరిపించాలని అంతవరకు తగిన ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. మున్సిపల్ పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. దశాబ్దాలుగా మున్సిపల్ టీచర్ల బదిలీలు చేపట్టలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి, మున్సిపల్ సంఘ నాయకులు మాకిరెడ్డి రాజునాయుడు, బాషా, నాతవరపు సతీష్, జిల్లా నాయకులు జోగా రాజేష్, దేముడు నాయుడు, మామిడి బాబూరావు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఎడికి నోటీసులు ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉత్సాహంగా క్రీడా పోటీలు

రైఫిల్ షూటింగ్‌లో విజేతలైన విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని పి.బోనంగిలో ఉన్న సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా రైఫిల్ షూటింగ్, వషు పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈఓ కె.నిశాంత్, ఎస్‌జిఎఫ్ అనకాపల్లి జిల్లా సెక్రటరీ ఎమ్.వి.నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. సుమారు వంద మంది వరకు పాల్గొన్న ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన వారితో రాష్ట్ర పోటీలకు ఎంపికైన జట్టును నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ జట్టు ఎంపికలో ముఖ్య పాత్ర పోషించిన కోచ్‌లు ఎస్.రామ్మోహన్, రమ్య, పర్యవేక్షకునిగా విధులు నిర్వహించిన జి. రాజులకు విశాఖ జిల్లా వ్యాయామం ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి కెఎమ్.నాయుడు అభినందనలు తెలిపారు.

కొత్తకోట : రావికమతం మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం చోడవరం నియోజకవర్గ స్థాయి బాలికల క్రీడా పోటీలు ఉల్లాసంగా జరిగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో ప్రతిభ చూపిన అండర్ 14,17 బాలికల కేటగిరిలో 200 మంది క్రీడాకారిణిలు కబడ్డీ, ఖో ఖో, బాల్ బ్యాడ్మింటన్ వాలీబాల్, చదరంగం పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన 120 మంది క్రీడాకారిణిలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

గెలిచిన కొత్తకోట విద్యార్థినులు

పోటీలను ప్రారంభిస్తున్న యలమంచిలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం : మండలంలోని మోసయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎలమంచిలి నియోజకవర్గ స్థాయి వాలీబాల్, కబాడీ, ఖోఖో వంటి క్రీడా పోటీలను సోమవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలలో ఓటమి పాలైన విద్యార్థులు నిరాశకు గురికావద్దన్నారు. ఒకసారి ఓటమి పాలైతే రెండోసారి రెట్టింపు ఉత్సవంతో క్రీడలలో విజయం సాధించడానికి వీలు పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి, జనసేన నాయకులు జే నరసింగరావు, ద్వారపురెడ్డి బాబ్జి, పుర్రె శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో పలు పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న తెనుగుబూడి గురుకుల ప్రిన్సిపాల్

ప్రజాశక్తి-దేవరాపలి : ఎస్‌జిఎఫ్ మాడుగుల నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో మండలంలోని తెనుగుబూడి గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సెప్టెంబర్ 27, 28 తేదీల్లో కె.కోటపాడు మండలం చౌడువాడ హైస్కూల్లో జరిగిన పోటీల్లో విజేతలను ప్రిన్సిపాల్ డి జయప్రకాష్ సోమవారం విలేకరులకు తెలిపారు. సీనియర్స్ అథ్లెటిక్స్‌లో 100, 200 మీటర్ల పరుగుపందెంలో పదో తరగతి విద్యార్థులు ఎస్.గౌరీ మణిశంకర్, లాంగ్ జంప్‌లో ఎన్.సాయి ప్రథమ స్థానాల్లో నిలిచారు. జూనియర్స్ విభాగం అండర్ 14లో తొమ్మిదవ తరగతి విద్యార్థులు జి.జగదీష్ 100, 200 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. 8వ తరగతి విద్యార్థి ఆర్.తరుణ్ 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, మరో విద్యార్థి, డి.ప్రశాంత్ 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించారు. వీరంతా జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిభ కనబరిచి విద్యార్థులను ప్రిన్సిపాల్ డి జయప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ పి.రఘు, స్కూల్ కమిటీ చైర్మన్ ఇరట.నరసింహమూర్తి, కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు జి.తరుణేశ్వరరావు, నాగేశ్వరరావు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డిసిఓ ఎస్.రూపావతి తదితరులు అభినందించారు.

కశింకోట : పాడేరు సిహెచ్ ఆశ్రమ పాఠశాలలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కుస్తీ పోటీలలో కశింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 17 బాలుర గ్రీకో- రోమన్ విభాగంలో బి.రోహిత్, కె.అఖిల్ స్వర్ణ పతకాలు, జె రాంచరణ్, సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరి రజిత పతకాలు సాధించారు. స్వర్ణ పతకాలు సాధించిన ఇద్దరు విద్యార్థులు త్వరలో విజయవాడలో జరుగు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో ఎల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు వేదుల ప్రభాకర్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం ఆచంట రవి, విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయులు ఎన్‌జెవి. ప్రసాద్, సూర్యప్రభ, వరలక్ష్మి, పిఎమ్.అప్పారావు అభినందనలు తెలిపారు.

కశింకోట : కశింకోట బాలికల హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఎంఎస్.శ్వర్ణ కుమారి, పిడి. కమల, ఉపాధ్యాయులు తెలిపారు.

ఎంపికైన కశింకోట బాలికల హైస్కూల్ విద్యార్థినులు

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన కశింకోట విద్యార్థులు

గొలుగొండ : నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో చోద్యం జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు 22 మంది జిల్లా స్థాయిలో ఎంపికైనట్లు పిఈటి కుందురు నూకరాజు తెలిపారు. హెచ్ఎం పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సిహెచ్‌వి.రమ, వరప్రసాద్, వాసు విద్యార్థులను అభినందించారు. జోగంపేట జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 27, 28 తేదీల్లో నర్సీపట్నంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్, సార్ట్ పుట్, డిస్కస్, రన్నింగ్ వంటి క్రీడల్లో సత్తా చాటి జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సరోజినీ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు పిడిలు నాగమణి, లోవలక్ష్మి తెలిపారు. పాయకరావుపేట మండలం, ఎస్.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గత నెల 27 ,28 వ తేదీల్లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో అండర్ - 14 విభాగంలో ఖోఖో, అండర్ - 17 విభాగం కబడ్డీ, డిస్కస్ త్రో, 800 మీటర్స్ రన్నింగ్‌లో పలువురు విద్యార్థులు ఎంపిక అయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు జె అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

లక్ష్యం దిశగా అడుగులు వేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యార్థులు లక్ష్యం దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలలు, కాలేజీల్లో స్వర్ణ ఆంధ్ర-2047 అనే అంశం పైన ప్రసంగాలు, చర్చలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన మొదట, ద్వితీయ, తృతీయ స్థానంలో ఉన్న విద్యార్థులకు సోమవారం జిల్లా కలెక్టర్ మెమెంటోలను అందజేశారు. విద్యార్థులతో ముచ్చటించిన జిల్లా కలెక్టర్ ఎల్లప్పుడూ తల్లిదండ్రులను గౌరవించాలని, క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి -అనకాపల్లి : బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో ముద్దాయికి ఐదు సంవత్సరాల కారాగార శిక్షతో పాటు 17వేల రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం విశాఖ ఫోక్సో కోర్టు తీర్పునిచ్చింది. ఎస్పీ దీపిక అందించిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా మునగపాక మండలం నాగవరానికి చెందిన బండారు రమణ 2019 ఫిబ్రవరి 10న అదే గ్రామానికి చెందిన మూడో తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి ఆమెను డాబా పైకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నేరం రుజువు కావడంతో సోమవారం ఫోక్సో కోర్టు ఈ తీర్పు చెప్పింది. కేసులో సహకరించిన పోలీసు సిబ్బందిని, న్యాయవాదులను ఎస్పీ అభినందించారు.

తహశీల్దారుగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కశింకోట : కశింకోట తహశీల్దార్‌గా అడబాల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు విశాఖపట్నం కలెక్టర్ ఆఫీస్ నుండి బదిలీ కసింకోట తాసిల్దార్‌గా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జి సత్యనారాయణ పాయకరావుపేట తహశీల్దారుగా బదిలీ అయ్యారు. నూతన తహశీల్దారుకు రెవెన్యూ సిబ్బంది పూల బొక్కలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పి రమేష్, జి భాస్కరరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం జంక్షన్ నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు సోమవారం ఎన్సీసీ విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆయన చేతుల మీదుగా మొక్కలను నాటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో విద్యార్థులు వ్యర్థ పదార్థాలను కాగితాలు ప్లాస్టిక్ సంచులు సేకరించి పరిసరాలను పరిశుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పరిశుభ్రత పట్ల ప్రజలు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రశాంతి విద్య సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, జనసేన మండల అధ్యక్షుడు బి రాందాస్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు జె శ్రీనివాసరావు, ద్వారపు రెడ్డి బాబ్జి, కె వెంకటరమణ, కూనిశెట్టి రమణ పాల్గొన్నారు.

ఫిజిక్స్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : స్థానిక ప్రభుత్వం జూనియర్ కాలేజీలో భౌతిక శాస్త్రం బోధించడానికి అతిథి అధ్యాపకులు నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి పేర్కొన్నారు. ఆమె సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సంబంధిత సబ్జెక్టులో పిజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దీనికి అర్హులని, ఆసక్తి అర్హత ఉన్నవారు తమ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాల అధికారులను సంప్రదించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

ప్రజాశక్తి - కశింకోట : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అండ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లా స్థాయిలో 120 పాఠశాల నుండి 181 ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఇందులో స్థానిక గాయత్రి పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు వారిలో ఎం ధనుంజయరావు, గుమ్మడి రత్నకుమారి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని ఎయు వివిఎస్.మూర్తి ఆడిటోరియంలో సత్కరించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ బి.రామకుమార్, యాజమాన్యం అభినందించినారు.

తహశీల్దార్‌ను సన్మానించిన సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు

తహశీల్దారుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపి అగ్రహారం గ్రామ సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నూతనంగా తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో విఆర్‌ఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'స్ఫూర్తి' అవార్డు అందుకున్న సత్యారావు

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం పొట్టి దొరపాలెం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ వడ్డి సత్యారావు స్ఫూర్తి ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. సత్యారావు వివిఎస్‌ఆర్ సేవా సంస్థని ఏర్పాటు చేసుకొని ఎంతోమంది అనాథలకు పేదలకు వృద్ధులకు ఆకలి తీరుస్తున్నాడు. మెడికల్ క్యాంపు పెట్టి ఉచితంగా వైద్యం చేస్తున్నాడు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సహాయం చేస్తున్నాడు. సత్యారావు సేవలను స్ఫూర్తి ఇంటర్నేషనల్ సంస్థ వారు గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాదులో అవార్డును సత్యారావుకు అందజేశారు.

సంకల్ప కాపు సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- సబ్బవరం : మండల సంకల్ప కాపు సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా గవర అప్పారావు, ఉపాధ్యక్షులుగా బలిరెడ్డి సత్యనారాయణ, కార్యదర్శిగా కుంచా ప్రసాద్, కోశాధికారిగా రేసుపూడి రమణ, సంయుక్త కార్యదర్శిగా కంచిపాటి రాంబాబు, సభ్యులుగా ఆకుల గణేష్, జెట్టి నాగ వరప్రసాద్, గల్లా సూరిబాబు, పడాల వెంకటరమణ, జెట్టి లీలా వరప్రసాద్ ఎన్నికయ్యారు. వీరంతా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను దుస్సలువాతో సత్కరించారు.

సభ్యుల సహకారంతో అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (అన్నపూర్ణ బ్యాంకు) సభ్యులందరి సహకారంతో అభివృద్ధి చెందుతుందని అసిస్టెంట్ రిజిస్టర్ /అఫీషియల్ పర్సన్ ఇంచార్జ్ వివివి సత్యకుమార్ తెలిపారు. సోమవారం జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకాలంలో రుణాలు చెల్లించిన సభ్యులు ఎవరైనా ఎవరైనా చనిపోతే, వారికి గతంలో దహన ఖర్చుల నిమిత్తం ఇస్తున్న రూ.5000ను సభ్యులకు కోరిక మేరకు రూ.6000కు పెంచినట్లు తెలిపారు. సంఘ సీఈఓ బడ్జెట్ చదవగా, సభ్యులు విని ఆమోదించారు. ప్రతి సంవత్సరం సభ్యులకు కావలసిన ఎరువులు సకాలంలో అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ మహాజన సభలో సభ్యులు పీలా బుజ్జి, పీల జగ్గ సత్యనారాయణ, బొడ్డపాటి చినరాజారావు, దొడ్డి సత్యఅప్పారావు, కోరుబిల్లి శంకర్రావు, వెలగా భాస్కర నర్సింగరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇవియంల స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎం మిషన్లను సోమవారం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా ఆమె ఆ ప్రాంతాన్ని, ఈవిఎంలను, సి.సి.టీవీల పుటేజ్లను వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. భద్రతాపరమైన చర్యలు గురించి అక్కడ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ చిన్నికృష్ణ, జిల్లా అగ్నిమాపక శాఖా అధికారి ఆర్.వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, డిటి ఎ.రవిబాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిత్యావసరాల ధరలు రోజు రోజుకు రికార్డు స్థాయిలో పెరిగిపోతున్నాయని, నేటి మార్కెట్లో ధరలు సామాన్యుల్లో ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఉల్లిపాయ టమోటా ధరలు వందకి పరుగులు తీస్తున్నాయన్నారు. వంద రోజుల పాలన ముగిసిందని ధరల పెరుగుదలపై నియంత్రణను ప్రభుత్వ పెద్దలు గాలికొదిలేశారని విమర్శించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ప్రజాశక్తి - యలమంచిలి

మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశించారు. యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలోని చెరువులు నీటిని నిల్వచేసుకోలేని స్థితిలో ఉన్నాయని, కాల్వలు ఆక్రమణకు గురయ్యాయని పేర్కొన్నారు. వాటిని సరిదిద్దడానికి కావలసిన నిధులు తెచ్చే బాధ్యత తను తీసుకుంటానని చెప్పారు. మెయిన్ రోడ్డు విస్తరణ 100 అడుగులకు మాస్టర్ ప్లాన్ ఆమోదించారని, దాని ముందుగా అమలు చేయాలన్నారు. వర్షాలకు పట్టణంలోని మురికి నీటిని శుద్ధిచేసి చెరువుల్లోకి వదలాలని సూచించారు. చెత్త నుంచి నిధులు సృష్టించే విభాగాన్ని పటిష్టపరచాలన్నారు. చైర్ పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ బస్‌స్టేషన్ విశాలంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన మూడు ఎకరాలు కేటాయించి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిషనర్ జె.ఎస్.పి.రాజు, సిఐ ధనుంజయరావు, టౌన్ ఎస్ఐ సావిత్రి, మున్సిపల్ డిఇ వీరయ్య, ఏఇ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాస్, మెస్మా పద్మావతి, ఎలక్ట్రికల్ ఏఇ, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విధులకు హాజరు కాకుంటే చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం కోమలపూడి పంచాయతీ బుద్ధి రెడ్ల పాలెం సచివాలయంలో సిబ్బంది ఇక మీదట విధులకు హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. బుద్ధిరెడ్ల పాలెం సచివాలయంలో సమయ పాలన పాటించని సిబ్బంది అనే శీర్షికన ప్రచురించిన వార్తకు ఎంపీడీవో విజయలక్ష్మి స్పందించారు. మండల సిబ్బందితో బుదిరెడ్లపాలెం సచివాలయాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయం ఉన్న పరిసరాలలో సిగ్నల్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వైఫై సహకారంతో సచివాలయం సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి జి అరుణ గంటికొర్లం, కోమలపూడి, బుదిరెడ్ల పాలెం సచివాలయాలకు కార్యదర్శి కావడంతో అందరికీ అందుబాటులో ఉండే విధంగా కోమల్ల పూడి ఆర్‌బికె కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సమాచారం లోపం కారణంగా ప్రజలు ఇబ్బంది పడ్డారని, ఇకమీదట ఇటువంటి తప్పిదం జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సచివాలయ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని, గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శి త్వరలోనే నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి 80వ వార్డు ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 80వ వార్డు నాయకుల ఆత్మీయ సమావేశం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ మాట్లాడుతూ యువకుడు ఉత్సాహవంతుడు అందర్నీ కలుపుకొని వెళ్లగలిగే కేయం.నాయుడును వార్డు ఇన్‌ఛార్జిగి నియమించినట్లు చెప్పారు. ఓడిపోయిన తర్వాత కూడా ఇంతమంది కార్యకర్తలు ఆత్మీయ సమావేశానికి హాజరు కావడం ఆశ్చర్యానికి గురిచేసిందని తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, తాను సేవ చేయడానికి మాత్రమే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. ఇప్పటికే కొంతమందికి తన కంపెనీలో ఉపాధి కల్పించానని, రాబోయే రోజుల్లో ఉపాధి కల్పిస్తానని తెలిపారు. వార్డు ఇన్‌చార్జి కెఎం నాయుడు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డేడ శివ, దాడి నారాయణరావు, డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, విల్లూరి వీర సంతోష్ కుమార్, పిళ్లా రాజు, శీలం నదియా, కాండ్రేగుల హైమావతి, గొల్లవిల్లి నరసింగరావు, బుద్ధ నరసింహారాజు, ఆడారి శ్రీను, కర్రి రుద్రి నాయుడు, దొడ్డి హరి, గొల్లవిల్లి చిరంజీవి, పెంటకోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎస్ శాంతి ప్రభ అన్నారు. హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా డెంగీ, చికెన్ గునియా వ్యాధులపైనా, పరిసరాల పరిశుభ్రతపైనా ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుగుణ, బి తిరుపతిరావు, ఐ.శ్రీనివాసరావు, ఎస్. శ్రీనివాస్, రామలక్ష్మి, సునీత, ఉమామహేష్, బి. శ్రీదేవి, గణేష్, రామస్వామి, శాంతి, ఇందిర, నాగేశ్వరరావు, ముకెష్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతి ప్రభ సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేయడంతో పాటుగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఆమె పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న యాంటీ లార్వెల్ సర్వే గతంలో చేసిన స్ప్రేయింగ్ కార్యక్రమాలను గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వర పీడితులకు సకాలంలో రక్త పరీక్షలు నిర్వహించి వైద్యం అందించాలని వైద్యాధికారి విమలగిరిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది బి తిరుపతిరావు, డి శ్రీదేవి, సిహెచ్ఓ ఆర్ దేవకాంత పాల్గొన్నారు.

ముగిసిన పోషణ్ మాసోత్సవాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

సెప్టెంబరు1వ తేదీన ప్రారంభమైన పోషణ్ మాసోత్సవాలు మండలంలోని రామచంద్రపురం అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మంగతాయారు మాట్లాడారు. గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రాసనం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్‌లు సుశీల, కళ్యాణి, ఆదిలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, ముందుగా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. సిబ్బంది తయారు చేసిన వంటకాలను పరిశీలించి రుచి చూశారు. గర్భిణీ స్త్రీలుకు సీమంతాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, నాయకులు చుక్క రాము నాయుడు, బండారు రామారావు, రెడ్డి శ్రీనివాసరావు, కుండ్రాపు సోము నాయుడు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల పట్ల అధికారులు శ్రద్ధ వహించి పునరావృత్తం కాకుండా చూడాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ విజయ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్‌ఓ దయానిధి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 40 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 ఫిర్యాదులు వచ్చాయి. వీట్లో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటివి ఉన్నాయి. జిల్లా అదనపు ఎస్పీలు నేరుగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్ రావు, ఎస్పై డి.వెంకన్న పాల్గొన్నారు.

షార్ట్ ఫిలిం విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగు సినీ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మీద అభిమానంతో అనకాపల్లికి చెందిన పతివాడ బాల గణేష్ నిర్మించిన అక్ష హృదయం షార్ట్ ఫిలింను జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి, అనకాపల్లి లాఫింగ్ క్లబ్ కార్యదర్శి బొడ్డేడ మురళి చేతుల మీదుగా సోమవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ గణేష్‌కు దర్శకుడు పూరి జగన్నాద్ అంటే చాలా ఇష్టమని, తన సొంత డబ్బులతో కథ మాటలు స్క్రీన్ ప్లే దర్శకత్వం వహించి ఈ షార్ట్ ఫిలిం చాలా చక్కగా తీశారని పేర్కొన్నారు. ఈ షార్ట్ ఫిలిం యూట్యూబ్ లో విల్లూరి నవీన్ లిరిక్స్ అనే పేజీలో ఉంటుందని, అందరూ ఈ పేజీని ఓపెన్ చేసి లైకు షేర్ చేసి గణేష్‌కి సపోర్ట్ చేయాలని మురళి కోరారు. ఈ కార్యక్రమంలో పాటల రచయిత విల్లూరి నవీన్ పిళ్ళా తారక రామారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు-2024 సోమవారంతో ముగిసాయి. ఇక్కడి అయ్యన్న విద్యాసంస్థల్లో స్కూల్, ఇంటర్, డిగ్రీ కాలేజీల విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ వ్యాసరచనపోటీల వలన విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత వెలుగు చూస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టరు ఖాశీం, కన్నూరు అప్పలనాయుడు, బండారు నారాయణపాత్రుడు, కన్నూరు చెల్లిబాబు, జేగురుపాటి భీమేశ్వరరావు, నక్కెళ్ళ మల్లేశ్వరరావు, బండారు కన్నబాబు, యడ్ల అప్పలనాయుడు, గజ్జి అప్పలనాయుడు, రావాడ వెంకటరమణ, కశిరెడ్డి చందు, ప్రసన్న, యామిని తదితరులు పాల్గొన్నారు.

బూడిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా నియమించబడిన మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును అనకాపల్లి నియోజకవర్గ వైసిపి నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. బూడిని కలిసిన వారిలో నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్ల సూరిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, మండల పెద్దిశెట్టి గోవింద్, కశింకోట మండల అధ్యక్షులు మలసాల కిషోర్, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, నాయకులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, జాజుల రమేష్, పెంటకోట జ్యోతి శ్రీనివాస్, మలసాల కుమార్ రాజా, బి.అప్పలరాజు తదితరులున్నారు.

అస్తవ్యస్తంగా జల జీవన్ మిషన్ పనులపై..

దద్దరిల్లిన మండల సమావేశం

అధికారులను నిలదీసిన సభ్యులు

ప్రశ్నిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి -కోటవురట్ల:జల జీవన్ మిషన్ పనులు ఇష్టారాజ్యంగా చేపడుతుంటే అధికారులు ఎవరూ పట్టించుకోరా అంటూ సోమవారం ఎంపిపి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశంలో పలువురు సభ్యులు నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పనులు ఆరు సంవత్సరాల పూర్తి కావస్తోంది అయినా గ్రామీణ ప్రాంతాల్లో ఒక గ్రామానికైనా పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేపట్టారా అంటూ బిజేపల్లి ఎంపిటిసి సభ్యులు, పలువురు సర్పంచులు నిలదీశారు. రోడ్లన్నీ ధ్వంసం చేసి పైపులైన్ వేశారని, అవి నాసిరకంగా వేయడంతో ఎక్కడ చూసినా లీకేజ్ లే దర్శనమిస్తున్నాయని. కాంట్రాక్టర్ ఎవరో, ఎవరిని అడగాలో తెలియని అయోమయంలో స్థానిక నాయకులు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవాలన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, ఇదంతా కాంట్రాక్టర్ కోసమే నా అంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల రెవెన్యూ అధికారులు ఫ్రీ ఓల్డ్ భూముల గ్రామాలైన పందూరు, బిజేపల్లి గ్రామాలను ఎందుకు ఎంపిక చేయలేదని, ఆయా గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని బిజేపల్లి ఎంపిటిసి సభ్యులు రాంబాబు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. 2003కి ముందు ఇచ్చిన రైతుల భూములను ఎందుకు ఫ్రీ ఓల్డ్ భూముల్లో చేర్చలేదని నిలదీశారు. గ్రామాల్లో అక్రమంగా ఇసుక తరలించుకుపోతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోరా అంటూ పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇస్తున్న రేషన్ సరుకులు కేవలం బియ్యంతో మాత్రమే సరి పెడుతున్నారని, మరణించిన వారి పేర్లు తొలగించక పోవడంతో డీలర్లు స్వాహా చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని పలువురు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు.రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోయి వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతుంటే పట్టించుకోరా అని ఆర్ అండ్ బి అధికారిని అడగగా నిధుల లేమి కారణంగా తుప్పలు తొలగించే అవకాశం లేదని చెప్పడంతో, కనీసం ఉపాధి హామీ నిధులతో తొలగించాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యురాలు ఉమాదేవి, ఎంపిడిఓ కాశీ విశ్వనాథరావు, తహసీల్దార్ తిరుమల బాబు, వైస్ ఎంపిపి దత్తుడు రాజు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు

పిల్లల చదువుపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - చీడికాడ: మండలంలోని వరాహపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులు తమ చదువుపై అడిగి తెలుసుకున్నారు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, తల్లిదండ్రులు ఇంట్ల వద్ద విద్యార్థుల పై శ్రద్ధ వహించి చదువుకునేటట్లు ప్రోత్సహించాలని, అప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మిస్కా అప్పారావు, సర్పంచ్ గొల్లవిల్లి చినమ్ములు రాజబాబు, ఎంపిటిసి స్వాతి కొండబాబు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారుల గుర్తింపు

ప్రజాశక్తి -కొత్తకోట:ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా 2014-19 మధ్య లబ్ధిదారుల గుర్తింపు రావికమతం మండలంలో జోరుగా సాగు తుంది. గృహ నిర్మాణ శాఖ మండల ఇంజనీరింగ్ అధికారి ప్రేమానంద్ ఆధ్వర్యంలో సిబ్బంది టిడిపి హయాంలో మంజూరైన లబ్ధిదారులపై ఆరా తీశారు.ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ఏఈ మాట్లాడుతూ, గతంలో ఈ పథకంలో 1022 మందికి పక్కా గృహాలు మంజూరు కాగా వీరిలో 637 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేయగా ప్రభుత్వం అప్పట్లో నిధులు విడుదల చేసిందని ఏఈ తెలిపారు. ఇంకా మరో 385 మంది లబ్ధిదారులకు ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఎటువంటి బిల్లులు చెల్లించలేదని తెలిపారు. వీరికి పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు సర్వే చేపడుతున్నామన్నారు.గుడిప గ్రామంలో సోమవారం గృహ నిర్మాణ శాఖ సిబ్బంది పర్యటించారు. 25 మంది ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులను గుర్తించి జియో టాకింగ్ ఆన్లైన్ మ్యాపింగ్ చేశారు...

ప్రోగ్రెస్ రిపోర్టును ఇస్తున్న ఇన్‌చార్జి హెచ్ఎం

విద్యార్థులకు మెరుగైన విద్య

ప్రజాశక్తి -చీడికాడ:విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గోవిందు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యుత్ తో పాటు పౌష్టికాహారం, క్రమశిక్షణ అలవరుస్తున్నామన్నారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టును తల్లిదండ్రుల సమక్షంలో అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కార్యాలయ ఏవో సూర్యనారాయణ ఆధ్వర్యం లో సోమవారం నిర్వహిం చారు. భూ సంబంధమైన సమస్యలు, పెన్షన్ మంజూ రుకు సంబంధించిన 15 ఫిర్యాదులు అందజేశారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆర్డీవో వివి రమణకు అందజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఏవో తెలిపారు . ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎఒ

నినాదాలు చేస్తున్న నాయకులు, నిర్వాసితులు

కారిడార్ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి:2010, 2011 సంవత్సరాల కటాఫ్ తేదీలను వ్యతిరేకిస్తూ స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులు నాయకులతో కలిసి సోమవారం ఆందోళన చేపట్టారు. ఇటీవల అధికారులు గ్రామ సచివాలయాల వద్ద ఆర్ఆర్ ప్యాకేజీకి గుర్తించిన లబ్ధిదారుల జాబితా ను వ్యతిరేకిస్తూ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. 2010, 2011 సంవత్సరాల కటాఫ్ తేదీలను అంగీకరించే ప్రసక్తే లేదని, పునరావాసం, పునర్నిర్మాణం, భూములు, చెట్లు, నిర్మాణాలకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించి ఎప్పటికైతే భూములు స్వాధీనం చేసుకుంటారో దానినే కటాఫ్ గా పరిగణించి అప్పటికి 18 సంవత్సరాలు నిండిన వారిలో ఇళ్ల కోల్పోయిన వారికి 25 లక్షలు,బాధిత కుటుంబాలకు 15 లక్షల ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టాన్ని, న్యాయ స్థానాల తీర్పులను అమలు చేయకుండా నిర్వాసితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని అన్యాయం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు పరిశ్రమలు ఏర్పాటు, అభివృద్ధి ఎంత ముఖ్యమో భూములు ఇచ్చిన రైతులను, కూలీలను, మత్స్యకారులను ఆదుకోవడం అంతే ముఖ్యమని తెలిపారు. అధికారులకు భూములు స్వాధీనం చేసుకోవడంతో ఉన్న తపన, శ్రద్ధ నిర్వాసితులను ఆదుకోవడంలో లేదని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు అనంతరం డిప్యూటీ తహశీల్దార్ అన్నాజీరావుకు వినతి పత్రం, వ్యక్తిగత దరఖాస్తు లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, చందనాడ గ్రామ సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్, ఎం పిటిసి గంటా తిరుపతిరావు, అమలాపురం ఉపసర్పంచ్ గంటా నర్సింగరావు, ఎం.రాజేష్, జి.గోవిందరావు, శ్రీను, నానాజీ, అప్పలరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వానపాములను వేస్తున్న నాయకులు

పాడి తడి చెత్త తో సేంద్రియ ఎరువుల తయారీ

ప్రజాశక్తి - చీడికాడ: పొడి తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేయవచ్చని సర్పంచ్ సత్యవతి తెలిపారు. మండలంలోని జైతవరం గ్రామంలో సర్పంచ్ సత్యవతి, ఎంపిటిసి పైలా ముత్యాల నాయుడు సంపద కేంద్రంలో వానపాములను విడుదలచేశారు. సంపద కేంద్రంలో వానపాములను వేయడంతో తడి చెత్త పొడి చెత్త మంచి ఎరువుగా తయారవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి, సచివాలయ కార్యదర్శి కొల్లి నవీన్ కుమార్, విఆర్ఓ గౌరీశంకర్, హార్టికల్చర్ అసిస్టెంట్ ఎ.రమణబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రసాభాసగా పిఎసిఎస్ సర్వసభ్య సమావేశం

సమావేశంలో సమస్యలు చెపుతున్న రైతులు

ప్రజాశక్తి -కోటవురట్ల:ఇది వరకులా పి.ఎ.సి.ఎస్‌ను సొంత జాగీరులా వాడుకుంటామంటే సహించేది లేదని సోమవారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశంలో పలువురు సభ్యులు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పి.ఎ.సి.ఎస్ ఇంచార్జ్ అధికారి జగన్నాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల టిడిపి నాయకులు కాశీనాయుడు, జానకి శ్రీను పాల్గొని రైతు సమస్యలపై చర్చించారు. ఇదివరకులా ఇష్టారాజ్యంగా పి.ఎ.సి.ఎస్‌ను సొంత జాగీరులా వాడుకుంటే సహించేది లేదని, ప్రతి అంశాన్ని రైతుల దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలను పరిష్కరించాలని, అర్హులందరికీ ఒకే విధంగా రుణాలు మంజూరు చేయడంతో పాటు, ఇన్పుట్ సబ్సిడీతో పాటు ఇన్సూరెన్స్ పొందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ సహకార సంఘంలో పనిచేసే ఉద్యోగులు గతంలో మాదిరిగా నాయకుల ఇంటికి వెళ్లి ఇంటి పనులు చేస్తే సహించేది లేదన్నారు. ఇప్పటికీ సంఘం రికార్డులు మాజీ నాయకుల వద్దకు తీసుకు వెళ్తు ఉండడం సరికాదన్నారు. రైతులకు, సంఘం సభ్యులకు జవాబుదారీతనంగా ఉండాలని కార్యదర్శికి సూచించారు.పిఎసిఎస్ ఆవరణలో వర్షపు నీరు నిలిచి పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం ఇన్చార్జి అధికారి జగన్నాథం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పటికే సంఘం నిధులు 1.50 కోట్ల వరకు ఉన్నాయని, 5354 మంది సభ్యులు సంఘంలో ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది రైతులకు 14 కోట్లు రుణాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వేచలపు జనార్ధన్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు రామచంద్రరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డిటిగా వెంకట చైన్లు

ప్రజాశక్తి-గొలుగొండ: మండల డిప్యూటీ తహశీల్దార్‌గా వెంకట చైన్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు.నక్కపల్లి మండలం నుంచి బదిలీపై గొలుగొండ మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కా రానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అవగాహన కల్పిస్తున్న మేనేజర్

గ్యాస్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:మహిళలందరికీ గ్యాస్ వినియోగంపై పూర్తి అవగాహన ఉండాలని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నర్సీపట్నం బ్రాంచ్ మేనేజర్ రమణ సూచించారు. మండలంలో లింగంపేట గ్రామంలో సోమవారం మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు మరిస రమణ ఆధ్వర్యంలో మహిళలకు గ్యాస్ వినియోగంపై ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ నుండి మంటల వ్యాప్తి, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం లబ్ధిదారులందరికి ఈకేవైసీ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది, జనసేన ప్రతినిధులు ప్రసాద్ పాల్గొన్నారు

తహశీల్దార్‌ను అభినందిస్తున్న నాయకులు

తహశీల్దార్‌ను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ:తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీనివాసరావును టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ ఆధ్వర్యంలో 27 పంచాయతీల టీడీపీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్లవరం సర్పంచ్ కొల్లి రాంబాబు, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ మాజీ సర్పంచ్ ఎస్.బాబ్జి, సర్పంచ్ చినబాబు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న ఇసుక

100 టన్నుల ఇసుక నిల్వలు స్వాధీనం

ప్రజాశక్తి -నక్కపల్లి:ఇసుక అక్రమ రవాణా పై పోలీసులు దాడులు చేస్తున్నప్పటికీ ఇసుక మాఫియా లో ఎటువంటి మార్పు కనిపించలేదు. మండలంలోని మూలపర్ర సమీపంలో సుమారుగా 100 టన్నుల ఇసుకను అక్రమ స్టాక్ పాయింట్ లో నిల్వ చేయడంతో ,సమాచారం మేరకు సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు ల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ,రెవెన్యూ అధికారుల సమక్షంలో అక్రమంగా దాచి ఉంచిన ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక బహిరంగ వేలం నిర్వహించగా లక్షా 3 వేల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. నగదును సంబంధిత పంచాయతీకి అప్పగిస్తామన్నారు .

హక్కులపై అవగాహనుండాలి

ప్రజాశక్తి- కోటవురట్ల:ప్రభుత్వాలు పౌరులకు కల్పించే హక్కుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉర్దవరావు సూచించారు. సోమవారం తంగేడు గ్రామంలో పౌర హక్కుల అవగాహన కార్యక్రమం సోషల్ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై పౌరులు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాల్సిందే

- -విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో కదంతొక్కిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు
- -పలుచోట్ల ధర్నాలు, ప్రదర్శనలు
- -డిమాండ్స్ డే విజయవంతం

నర్సీపట్నంలో మాట్లాడుతున్న సిఐటియు నేత రాజు

యలమంచిలిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ పరిశ్రమల్లోనూ, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వంటి పర్మినెంటేతర కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. నాన్ పర్మినెంట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లెన్స్ ప్రకారం సమాన పనికి సమానవేతనం చెల్లించాలని డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టాలని సిఐటియు అఖిల భారత కమిటీ పిలుపుమేరకు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద వేలాదిమంది కాంట్రాక్ట్ కార్మికులతో మహాధర్నా చేపట్టారు. ధర్నాకు ముందు జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, సెంట్రల్ పార్కు మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్ధేశించి నర్సింగరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అతితక్కువ వేతనాలు ఇచ్చి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులతో పనులు చేయించుకుంటున్నాయన్నారు. 1991 తరువాత సరళీకరణ విధానాల పేరుతో పర్మినెంట్ చేయటం నిలుపుదల చేశారని, శాశ్వత స్వభావం కలిగిన పనుల్లోనూ పర్మినెంట్ కార్మికులు చేసే పనులను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులతో గొడ్డుచాకిరి చేయించుకుంటున్నారన్నారని విమర్శించారు. తెల్లారి లేస్తే నగరాన్ని అద్దంలాగా ఉంచే మున్సిపల్ కార్మికులను సైతం ఎందుకు పర్మినెంట్ చేయరని ప్రశ్నించారు. పర్మినెంట్ కార్మికుని బేసిక్ పే కూడా వీరికి చెల్లించడం లేదన్నారు. యజమానుల దయాదాక్షిణ్యాల మీద బ్రతకాల్సిన దుస్థితి నేడు దాపురించిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యోగం ఉంటుందో లేదోనని ఆందోళన, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ, ఎరియర్స్, విడిఎ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏమీ వర్తించడం లేదన్నారు. బ్రాండిక్స్ వంటి కంపెనీల్లో ఉన్న జీతాలను తగ్గించారన్నారు. హైర్ అండ్ ఫైర్ విధానం అమలు చేస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ సమస్యను అడ్డం పెట్టుకొని కార్మికుల శ్రమను దోపిడీచేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దుచేయాలని, దేశవ్యాప్తంగా నాన్ పర్మినెంట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్న డిమాండ్‌తో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వరంగంలో ఉండే పరిశ్రమల్లోనే కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండటం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీవేజ్, 28డేస్, పీస్‌రేట్, టైంస్కేల్, గౌరవవేతనం ఉద్యోగులు అని ముద్దుపేర్లు పెట్టి కార్మికులకు చట్టాలను అమలు చేయకుండా, పర్మినెంట్ కాకుండా చేస్తున్నారని విమర్శించారు. కనీసం రూ.26 వేల వేతనం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి, హెచ్‌పిసిఎల్, పోర్టు, రైల్వే, కోరమాండల్, ఆర్‌టిసి, విశాఖ డెయిరీ, ప్రభుత్వ హాస్పిటల్స్, 108, విద్యుత్ తదితర వివిధ రంగాల కార్మికులు, సిఐటియు నాయకులు పి.వెంకటరెడ్డి, బి.జగన్, యు.రాజు, టి.నూకరాజు, ఎం.సుబ్బారావు, పి.మణి, డి.కొండమ్మ, పి.వెంకటరావు, అప్పలనాయుడు, తులసీరాం ఒ.అప్పారావు, కె.పెంటారావు, నరేష్, జి.అప్పలరాజు, బి.వెంకటరావు, ఎ.సీతాలక్ష్మి, అనసూయ, రాజకుమార్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వివిద శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. సోమవారం నర్సీపట్నం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్, విద్యా, వైద్య, ఇతర అన్ని ప్రభుత్వ శాఖల పరిశ్రమలలో లక్షలాది మంది ఏళ్ల తరబడి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్నారన్నారు. వీరు పర్మినేంట్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నారని, ఇచ్చే జీతం చాలా వ్యత్సారం ఉందన్నారు. ఉద్యోగ భద్రత లేదన్నారు. సర్వీసులో మరణిస్తే కుటంబాన్ని ఉద్యోగం కల్పించ లేదని చెప్పారు. తక్షణమే వీరికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లోవరాజు, రాజు, అర్జమ్మ, దుర్గా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి:కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, పర్మినెంట్ కానీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ సిఐటియు కార్యాలయం నుండి అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్దకు ర్యాలీ చేసి, అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి కోటేశ్వరరావు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నా చాలీచాలని జీతాలతో జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు చెప్పినా అమలు చేయడం లేదన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, ఇందులో భాగంగా ఫిక్స్ టర్మ్ కార్మికులుగా చేయాలని చూస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి చట్టాలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నిమ్మకాయల అజయ్, నూకరాజు, గాంధీ, సంతోష్, రాము, అమ్మాజీ, శ్రీను, భారతి, చిన్ని, అద్దె బస్సు వర్కర్స్ యూనియన్ నాయకులు నాగప్పరావు, నాయుడు, శివ, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యలమంచిలి : కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ శివాజీ, సిహెచ్ రామకృష్ణ సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాదురాజుకు వినతి పత్రం సమర్పించారు. పట్టణంలో కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు.

ఉపాధ్యాయుల ఓటు నమోదుకు దరఖాస్తు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి సెప్టెంబర్ 30న నోటిఫికేషన్ వెలువడిందని, సోమవారం నుంచి ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఓటు నమోదు కార్యక్రమం నవంబర్ 6 వరకు కొనసాగుతుందన్నారు. నవంబర్ 23న డ్రాఫ్ట్ పబ్లిష్ అవుతుందని, 23 నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని చెప్పారు. అన్ని పరిశీలనల అనంతరం డిసెంబర్ 30న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ అవుతుందని వివరించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు.

ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా ఓటు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు సెకండరీ స్థాయికి (ఆరో తరగతికి పైబడి) మించిన పాఠశాలలు, కళాశాలలు, యూనివర్శిటీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అర్హులేనని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చెప్పారు. రెగ్యులర్, ఎడ్-హక్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఓటు నమోదులో భాగంగా స్వీయ ధ్రువీకరణ పత్రంతో పాటు, సంబంధిత సంస్థ హెచ్ఒడి నుంచి సర్టిఫికెట్ తీసుకొని సమర్పించాలని వివరించారు.

జిల్లాలో 43 కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణలో భాగంగా విశాఖ జిల్లాలో 43 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1941 కేంద్రాలు ఉండగా 1500 మంది ఓటర్లు దాటిన చోట కొత్త వాటిని ప్రతిపాదిస్తున్నట్లు సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు క్షేత్ర స్థాయి పరిశీలన, నియోజకవర్గ స్థాయి పొలిటికల్ పార్టీలతో జరిగిన సమావేశాల్లో గుర్తించిన అంశాల మేరకు నివేదిక తయారు చేసి పంపించనున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయి అవసరాలు, స్థానిక విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకొని 31 కేంద్రాలకు స్థాన చలనం, 12 కేంద్రాలకు పేర్ల మార్పు, నాలుగు కేంద్రాలను మిళితం చేస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఇప్పుడు ప్రతిపాదించే 43లో నాలుగు డిలీట్ లేదా మిళితం అయితే కొత్తగా 39 కేంద్రాలు ఏర్పాటు అవుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

పలు చోట్ల శ్రమదానం

ప్రజాశక్తి - మాడుగుల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మాడుగులలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల పరిశుభ్రపరిచారు. సోమవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయము వద్ద పరిశుభ్రం చేశారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ ప్రథమ చికిత్స పై అవగాహన కల్పించారు.

నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్ల జారీచేసిన అధికారులను శిక్షించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్లు జారీచేసిన అధికారులను శిక్షించాలని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ డిమాండ్‌చేశారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ల జారీలో రాష్ట్రంలో వివిధ జిల్లాలలో అధికారుల నిర్లక్ష్యం వల్ల హక్కుదారులైన అనేక కుటుంబాలు ఆస్తులు కోల్పోయి వేదన అనుభవిస్తున్నాయని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరపకుండా కొందరు అధికారులు అవినీతికి పాల్పడి కుటుంబ సభ్యునిగా చేర్చి సర్టిఫికెట్ ధ్రువీకరిస్తున్నారని ఆరోపించారు. వేరొక వ్యక్తి ఇటువంటి ఫ్యామిలీ సర్టిఫికెట్ పొంది తమ ఆస్తిని కాజేసే ప్రయత్నం చేసిన విషయాన్ని విశాఖ నగరానికి చెందిన తురుమెళ్ళ వైష్ణవి ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కాకినాడ కలెక్టర్ తగిన విచారణ జరిపించి వాస్తవాలు గ్రహించి సర్టిఫికెట్ రద్దు చేశారని తెలిపారు. ఇటువంటి సంఘటనలు అనేకం జరగడం ద్వారా సివిల్ తగాదాలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. తప్పుడు పత్రాలతో ఆస్తిని చేజిక్కించుకోవాలనుకున్న వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తమిళనాడులో మాదిరిగా బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.